క్లుప్తంగా

మంత్రి పొన్నంకు కృతజ్ఞతలు



పొన్నంను సన్మానిస్తున్న పాలకవర్గ సభ్యులు

హుస్నాబాద్: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో ఆదివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల నూతనంగా హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తిరుపతి రెడ్డి, వైస్ చైర్మన్‌గా బంక చందుతో పాటు పాలకవర్గ సభ్యులను ప్రకటించారు. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు.

నిధులకోసం మంత్రికి వినతి



బండి సంజయ్‌ను కలిసిన నాయకులు

కోహెడ(హుస్నాబాద్): మండలంలోని 27గ్రామాలలో చెపట్టనున్న పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను బీజేపీ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం కోరారు. కరీంనగర్‌లో ఆదివారం మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశం ఆయన ఈజీఎస్ గ్రాంట్ నుంచి ప్రత్యేక నిధులు మంజూరు చేయించాలని కోరానన్నారు. అందుకు మంత్రి సానుకులంగా స్పందించినట్లు తెలిపారు. ఆయన వెంట కృష్ణారెడ్డి, ప్రవీణ్‌రావు, శ్రీనివాస్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

సాహిత్య కృషి ద్వారా కీర్తి



రాజమౌళిని సన్మానిస్తున్న కవులు, రచయితలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సాహిత్య కృషి ద్వారా ఎనలేని కీర్తి సాధించవచ్చునని కథా రచయిత ఐతా చంద్రయ్య అన్నారు. ఇటీవల పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ బాలసాహిత్య పురస్కారం పొందిన ఎన్నవెళ్ళి రాజమౌళికి సిద్దిపేటలో కవులు, రచయితల ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సత్కారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కథల తాతయ్యగా పేరుగాంచిన రాజమౌళి మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ రమేశ్, రాజేశం, లక్ష్మయ్య, నరసింహారావు, రాజ్ కుమార్, వెంకటేశ్వర్లు, రమేశ్ లాల్, రాములు, సురేందర్, రాములు, పరశురాములు, సిద్దిరాములు తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కొండల్‌రెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధనకై చేపట్టిన ప్రజాసంకల్ప దీక్ష కరపత్రాలను మాజీ జెడ్పీటీసీ గిరి కొండల్ రెడ్డి ఆదివారం దూళ్మిట్ట మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన జరిగే దీక్షలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

రెండు ఉద్యోగాలు సాధించిన యువకుడు



రవి

చిన్నకోడూరు(సిద్దిపేట): మండలంలోని చౌడారం గ్రామానికి చెందిన రవి రెండు ఉద్యోగాలు సాధించాడు. గ్రామానికి చెందిన చౌడారం లక్ష్మి లింగయ్య దంపతుల కుమారుడు రవి గత యేడాది విడుదల చేసిన పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించి సివిల్ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికై శిక్షణ పూర్తి చేసుకున్నాడు. శిక్షణ ముగిసే సమయంలోనే ఇటీవల గ్రూప్-4 ఫలితాలు విడుదల కావడంతో వార్డు అధికారి ఉద్యోగాన్ని కూడా సాధించాడు. పేద కుటుంబంలో పుట్టినా రవి బాల్యం నుంచి టాపర్‌గా నిలుస్తున్నాడు. రవి రెండు ఉద్యోగాలు సాధించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

సర్వే వివరాల సమగ్ర నమోదు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే చివర దశకు చేరుకుంది. ఎన్యుమరేటర్లు సేకరించిన కుటుంబ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. దుబ్బాక మున్సిపల్ పరిధిలో ఆ ప్రక్రియ మొదలైంది. 20 వార్డులలో 58 బ్లాక్‌లలో ఎన్యుమరేటర్లు సర్వే నిర్వహించారు.



డేటా ఎంట్రీ చేస్తున్న ఆపరేటర్లు

7,784 కుటుంబాల వివరాలు

- ప్రారంభమైన ఆన్‌లైన్ నమోదు
- దుబ్బాక మున్సిపల్‌లో 58బ్లాక్‌లు
- బ్లాక్‌కు ఒకరి చొప్పున ఆపరేటర్

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపల్ పరిధిలో లచ్చపేట, ధర్మాజీపేట, చెల్లాపూర్, మల్లాయపల్లి, చర్వాపూర్, దుంపలల్లి, దుబ్బాకతో సహా 20వార్డులలో 7,784 కుటుంబాలు ఉన్నాయి. ఇప్పటి వరకు 7,637 కుటుంబాలకు సంబంధించిన సర్వే పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

మొదలైన డేటా ఎంట్రీ

సమగ్ర కుటుంబ సర్వే చివరి దశకు చేరడంతో ప్రభుత్వం ఆన్‌లైన్ నమోదుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మున్సిపల్‌లో 58బ్లాక్‌లకు ఒక్కో డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమించారు. వారికి లాగ్ ఇన్‌లను ఇచ్చి ప్రక్రియ ప్రారంభించారు. ఒక్క రోజుకు ఒక్కో లాగ్‌ఇన్‌లో 25 అప్లికేషన్‌లను నమోదు చేసేలా అవకాశం ఇచ్చారు.

పారదర్శకంగా నమోదు



ఎన్యుమరేటర్లు సర్వేలో సేకరించిన సమాచారాన్ని డేటా ఎంట్రీ ఆపరేటర్లతో పారదర్శకంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయిస్తున్నాం. మున్సిపల్ కార్యాలయంలో 58 కంప్యూటర్లను ఏర్పాటుచేసి 58 మంది ఆపరేటర్లను నియమించాం. సమాచారాన్ని నమోదు చేయిస్తున్నాం.

– రమేశ్ కుమార్, మున్సిపల్ కమిషనర్, దుబ్బాక

ఎలాంటి సమస్యలు లేవు..



ఆన్‌లైన్ డేటా ఎంట్రీ చేసేటప్పుడు ఎలాంటి సమస్యలు తలెత్తడం లేదు. రోజుకు 25 కుటుంబాల డేటాను జాగ్రత్తగా ఎంట్రీ చేస్తున్నాం. ఒక్కో కుటుంబం వివరాలు నమోదు చేయడానికి దాదాపు 8 నుంచి 12 నిమిషాల సమయం పడుతోంది.

– సాయికృష్ణ, డేటా ఎంట్రీ ఆపరేటర్

అ'పూర్వ'సమ్మేళనం

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం అంతక్కపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 23యేళ్ల తర్వాత ఒక్కచోట కలుసుకుని వారంతా సందడి చేశారు. ఆ నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు చెప్పిన అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు

ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటాం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

- వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్

చిన్నకోడూరు(సిద్దిపేట)/నంగునూరు(సిద్దిపేట): ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటామని వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ గుడిమల్ల సత్తయ్య అన్నారు. డిసెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించే మాలల సింహగర్జన పోస్టర్‌లను ఆదివారం చిన్నకోడూరులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీల అభిప్రాయాన్ని సేకరించకుండా వర్గీకరణ అమలు పేరుతో కమిటీ నియమించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం అన్నారు. మాలలంతా సింహగర్జన సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. నాయకులు రవి, మల్లేశం, కృష్ణ, అనిల్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నంగునూరులో మాల మహానాడు మండల అధ్యక్షుడు దాసరి రమేశ్ ఆధ్వర్యంలో పోస్టర్‌లను ఆవిష్కరించారు. కృష్ణ, నర్సింగరావు, రాజయ్య, ఎల్లదాసు, రవి, మహేందర్, అశోక్, సాంబయ్య, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా సిరత్ ఉల్ నబీ పరీక్ష

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జమియత్ ఉలేమా ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో సిరత్ ఉల్ నబీ క్విజ్ పోటీలు విజయవంతంగా జరిగాయి. పాఠశాల, కళాశాల విద్యార్థినుల కోసం ఉర్దు, ఇంగ్లిష్ భాషల్లో పరీక్షలు నిర్వహించారు. నాలుగో తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుతున్న వారిని అనుసరించి నాలుగు విభాగాల్లో క్విజ్ పరీక్ష నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన 500 మంది హాజరుకాగా వారిలో 100 మంది ముస్లిమేతరులు కావడం విశేషం. పరీక్షలను జమియత్ ఉలేమా జిల్లా అధ్యక్షుడు ముఫ్తీ అబ్దుల్ సలాం సాహెబ్ ఖాస్మి పర్యవేక్షించారు. కార్యక్రమంలో మహమ్మద్ అలాం సాహిబ్, అబ్దుల్ రహీం, ఆరిఫ్, ఫహీం, యూసుఫ్, ఉస్మాన్, ఫారూఖ్, సమీర్, ఉలేమా హఫాజ్ పాల్గొన్నారు.



పరీక్షలను పర్యవేక్షిస్తున్న జమియత్ ఉలేమా ప్రతినిధులు

ప్రాథమిక పాఠశాలలతోనే విద్యారంగం పరిరక్షణ

సిద్దిపేటకమాన్: ప్రాథమిక పాఠశాలల బలోపేతంతోనే విద్యారంగాన్ని పరిరక్షించగలమని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి, కార్యదర్శి వెంకట్ అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం టీఎస్‌యూటీఎఫ్ ఐదో మహాసభలు నిర్వహించారు. ఈ సంధర్బంగా వారు మాట్లాడుతూ.. ప్రతి పాథమిక పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సమాన వేతనం అందజేయాలన్నారు. హేమంత్, యాదగిరి, కృష్ణ, సావిత్రి, నాగదేవత, వెంకటకిరణ్, ప్రశాంత్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటుతున్న ఏసీపీ మధు, సీఐ

సిద్దిపేటఅర్బన్: పర్యావరణ పరిరక్షణ అందకి బాధ్యత అని ఏసీపీ మధు అన్నారు. త్రీటౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో సేవ్ ఎర్త్ సేవ్ లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సీఐ విద్యాసాగర్‌తో కలిసి ఆయన మొక్కలు నాటారు. రాబోయే తరాలకు మంచి వాతావరణాన్ని అందించడం మన బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ఫౌండర్ యాదగిరి, ప్రతినిధి రాజలింగం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టల్‌లో సమస్యలు పరిష్కరించండి

గజ్వేల్: స్థానిక ఎస్టీ హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డీబీఎఫ్(దళిత బహుజన ఫ్రంట్) రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హాస్టల్ భవనం పెచ్చులూడుతుండటంతో విద్యార్థులు భయాందోళనలో గడుపుతున్నారన్నారు. దోమలు బారినపడుతున్నారని, బాత్‌రూమ్‌లు లేక అవస్థలు పడుతున్నారని చెప్పారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

బ్రోచర్ ఆవిష్కరణ

కొండపాక(గజ్వేల్): లీడ్ లైఫ్ హ్యాపీలీ సంస్థ నిర్వహిస్తున్న పాత్ ఫైండర్ పోటీ పరీక్ష బ్రోచర్‌ను జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణితశాస్త్రంలో విద్యార్థులకు వివిధ అంశాల్లో విజ్ఞానం పెంపొందించుకునేలా సంస్థ కృషిచేస్తోందన్నారు. 28న పాఠశాల స్థాయిలో పరీక్షను నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి ఫిబ్రవరి 8న జిల్లా స్థాయిలో నిర్వహించనున్నట్టు చెప్పారు. విజేతకు రూ.50 వేల నగదును అందజేస్తారని డీఈఓ చెప్పారు.

ట్రాక్టర్ బ్యాటరీ చోరీ

మద్దూరు(హుస్నాబాద్): ట్రాక్టర్ బ్యాటరీని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన ఘటన మండలంలోని లద్నూరు గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బెదడ సత్తయ్య తన ట్రాక్టర్‌ను వ్యవసాయ బావి వద్ద ఉంచి ఇంటికి వచ్చాడు. ఆదివారం ఉదయం వెళ్లి చూడగా ట్రాక్టర్ బ్యాటరీ చోరీకి గురైనట్లు గుర్తించాడు. చర్యలు తీసుకోవాలని కోరాడు.

సంక్షిప్త వార్తలు

◆ 'ఆర్థిక చేయూత' ఔదార్యం

గజ్వేల్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌కు చెందిన నిరుద్యోగి టి.మల్లేశానికి స్థానిక ఆర్థిక చేయూత ఫౌండేషన్ అండగా నిలిచింది. అతడి జీవనోపాధి కోసం ఫౌండేషన్ సభ్యులు ఆర్థిక సహకారం అందజేసి ప్రజ్ఞాపూర్‌లో ఆదివారం టీ-స్టాల్‌ను ప్రారంభించారు.

◆ ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

సిద్దిపేటజోన్: జిల్లా కేంద్రంలోని క్రికెట్ స్టేడియంలో నిర్వహిస్తున్న సీఎం రేవంత్ క్రికెట్ పోటీలు హుషారుగా సాగుతున్నాయి. ఆదివారం క్రీడాభిమానులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. మెట్‌పల్లి, మాచాపుర్, పాలమాకుల, సహారా జట్లు విజయం సాధించాయి. నిర్వాహకులు శ్రీనివాస్ రెడ్డి, నరేందర్‌రెడ్డి బహుమతులు అందజేశారు.

◆ డాక్టర్ సురేశ్‌బాబుకు సన్మానం

సిద్దిపేటకమాన్: ప్రభుత్వ ఆసుపత్రిలో పీడియాట్రిక్ హెచ్‌ఓడీ డాక్టర్ సురేశ్‌బాబును నేషనల్ నియోనాటాలజీ ఫోరం ప్రతినిధులు హైదరాబాద్‌లో సన్మానించారు. తక్కువ బరువుతో జన్మించిన శిశువులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న నేపథ్యంలో ఆయనను సన్మానించినట్లు తెలిపారు.

◆ సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు

తొగుట(దుబ్బాక): గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర మంత్రి కొండా సురేఖ నిధులు మంజూరు చేశారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అక్కం స్వామి తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడారు. మండలంలోని గుడికందులలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ.55లక్షలు, తుక్కాపూర్‌లో సీసీ రోడ్డు, మురుగు కాల్వల నిర్మాణానికి రూ.30లక్షలు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో బండారుపల్లి మాజీ సర్పంచ్ బాల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ఉప్పలయ్య, స్వామి, గోపాల్, భాస్కర్, రాంరెడ్డి పాల్గొన్నారు.

◆ సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

తొగుట(దుబ్బాక): పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి ఆదివారం పంపిణీ చేశారు. మండలంలోని వెంకట్రావుపేటకు చెందిన పాత్కుల మహిపాల్‌కు రూ.9వేలు, మల్లవ్వకు రూ.15 వేలు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

◆ ముఖ్య కార్యకర్తల సమావేశం

నంగునూరు(సిద్దిపేట): ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని సోమవారం నంగునూరులో నిర్వహిస్తామని మండల ఇన్‌చార్జి ఆరెపల్లి కనకయ్య తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అనుబంధ సంఘాల నూతన మండల కమిటీలను ఎన్నుకుంటామన్నారు. కార్యకర్తలంతా హాజరుకావాలని పిలుపునిచ్చారు.

◆ బీసీ సమరభేరిని విజయవంతం చేయాలి

హుస్నాబాద్: హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో సోమవారం నిర్వహించే బీసీ సమరభేరి సదస్సును విజయవంతం చేయాలని బీసీ హక్కులసాధన సమితి నేత సుదర్శనచారి పిలుపునిచ్చారు.

మెడికల్ కళాశాల హామీకి ఏడాది

- ఎన్నికల ప్రచారంలో ప్రియాంకగాంధీ
- 250 పడకల ఆస్పత్రికి రూ.82కోట్ల మంజూరు
- మంత్రి చొరవ చూపాలంటున్న ప్రజలు



ఎన్నికల ప్రచారసభలో ప్రియాంకగాంధీ (ఫైల్)

హుస్నాబాద్: శాసనసభ ఎన్నికల ప్రచారసభలో పొన్నం ప్రభాకర్‌ను గెలిపిస్తే హుస్నాబాద్‌లో మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకురాలు ప్రియాంకగాంధీ హామీ ఇచ్చి నేటికి ఏడాది పూర్తయింది. హుస్నాబాద్‌లోని ఏనే వద్ద గత ఏడాది ఇదే రోజు కాంగ్రెస్ ఎన్నికల ప్రచారసభలో పొన్నం ప్రభాకర్‌కు మద్దతుగా ప్రియాంక గాంధీ పాల్గొన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన పొన్నం ప్రభాకర్ మంత్రి అయ్యారు. మరో వైపు వాయ్‌నాడు ఉప ఎన్నికల్లో ప్రియాంకగాంధీ పోటీచేసి ఎంపీగా భారీ మెజార్టీతో గెలుపొందారు. ఇప్పటికే జిల్లెల్లగడ్డలో మెడికల్ కళాశాల ఏర్పాటు కోసం దాదాపు 40 ఎకరాల భూమిని పరిశీలించి అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు సమాచారం. అలాగే మెడికల్ కళాశాలకు అనుబంధంగా హుస్నాబాద్‌లో 250 పడకల ఆస్పత్రి భవనం నిర్మాణం కోసం రూ.82కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రియాంకగాంధీ హామీ మేరకు మెడికల్ కళాశాల ఏర్పాటుకు అడుగులు పడేనా? అనేది ప్రజల్లో చర్చాంశనీయంగా మారింది. మెడికల్ కళాశాల ఏర్పాటుతో ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందే అవకాశం ఉంటుంది. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆ దిశగా చొరవ చూపాలని ఈ ప్రాంత ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

ప్రజా సంకల్పను విజయవంతం చేయండి



చేర్యాల(సిద్దిపేట): మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

- మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట)/కొమురవెల్లి(సిద్దిపేట): చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోసం జేఏసీ ఆధ్వర్యంలో 30న తలపెట్టిన ప్రజాసంకల్ప దీక్షను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జేఏసీ ప్రతినిధుల కోరిక మేరకు దీక్షకు కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఇస్తోందన్నారు. నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని సూచించారు. చేర్యాలను రెవెన్యూ డివిజన్‌తో పాటు అసెంబ్లీ నియోజకవర్గంగా కూడా చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామనని చెప్పారు. సమావేశంలో మార్కెట్ చైర్మన్ శ్వేత, మండల అధ్యక్షుడు రవి, నాయకులు ఆగంరెడ్డి, చిరంజీవులు, నర్సింగరావు, శ్రీకాంత్, మల్లేశం, యాదగిరి, నరేందర్, లింగం, రమేశ్, ఖాజా, యాదయ్య, నాగరాజు, ప్రసాద్, బుచ్చిరాములు, సంతోష్‌రెడ్డి, నానిబాబు, రాజేశ్వరి, జయలక్ష్మి, విజయ తదితరులు పాల్గొన్నారు. కొమురవెల్లిలో నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్ పాల్గొన్నారు. రెవెన్యూ డివిజన్ సాధన కోసం జరిగే ప్రజాసంకల్ప దీక్షకు కొమురవెల్లి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. భాస్కర్, శ్రీనివాస్, రమణారెడ్డి, కనకరాజు, శ్రీనివాస్, గణేశ్, పరశురాములు, రాజు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

అనుమతిలేని నిర్మాణాలపై చర్యలు తప్పవు

- ఏసీపీ పురుషోత్తం రెడ్డి



నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి

దుబ్బాకటౌన్: ప్రభుత్వ భూముల్లో ముందస్తు అనుమతులు లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి సూచించారు. రాయపోల్ మండలం రామారం శివారులోని సర్వే నెంబరు 481లోని ప్రభుత్వ స్థలంలో చేపట్టిన దర్గా నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్థలంలో అనుమతి లేకుండా దర్గా నిర్మాణం చేపడుతున్నారని బీజేపీ రాయపోల్ మండల అధ్యక్షుడు రాజాగౌడ్ చేసిన ఫిర్యాదు మేరకు దర్గా నిర్మాణాన్ని పరిశీలించామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దర్గా నిర్మాణానికి సంబంధించిన అనుమతుల విషయంలో విచారణ జరపవలసిందిగా తహసీల్దార్, ఆర్డీఓకు లేఖ రాశామని, వారి విచారణకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని డీసీపీ చెప్పారు. ఆయన వెంట తొగుట సీఐ షేక్ లతీఫ్, రాయపోల్ ఎస్‌ఐ రఘుపతి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అతివేగం, అజాగ్రత్త వల్లే ప్రమాదాలు



ఆటోడ్రైవర్లతో మాట్లాడుతున్న ఎస్‌ఐ

- ఎస్‌ఐ బాలకృష్ణ

చిన్నకోడూరు(సిద్దిపేట): అతివేగం, అజాగ్రత్తగా వాహనాలు నడపడం వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతాయన్నాయని, నిబంధనలు పాటిస్తే వాటిని నివారించవచ్చని ఎస్‌ఐ బాలకృష్ణ పిలుపునిచ్చారు. చిన్నకోడూరులో ఆటోడ్రైవర్‌లు, వాహనదారులకు ఆదివారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపవద్దన్నారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని సూచించారు. ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్‌లు పాల్గొన్నారు.

రోడ్డుపై ధాన్యం ఆరబోయవద్దు

కోహెడరూరల్(హుస్నాబాద్): రైతులు రోడ్డుపై ధాన్యం ఆరబోయవద్దని, దానివల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని కోహెడ ఎస్‌ఐ అభిలాష్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రోడ్డుపై ధాన్యం పోయడం వల్ల నిత్యం ఎక్కడో ఒకచోట ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రైతులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

వామపక్షాలకు పూర్వవైభవం ఖాయం

- సీపీఎం జిల్లా నేత శశిధర్

సిద్దిపేటఅర్బన్: రానున్న రోజుల్లో వామపక్షాలకు పూర్వ వైభవం రావడం ఖాయమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శశిధర్ అన్నారు. సిద్దిపేటలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం సిద్దిపేట రూరల్ మహాసభ చింతల వెంకటయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని, గ్రామాల్లో, పట్టణాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించి ప్రజల ఆరోగ్యం కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అరవింద్, యాదగిరి, నవీన్, మచ్చేందర్, రవి, తిరుపతి, నర్సయ్య, కనకయ్య, నర్సయ్య, రవి తదితరులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా 26న నిర్వహించనున్న దేశవ్యాప్త నిరసనలను విజయవంతం చేయాలని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపు మేరకు సీపీఎం కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. నాయకులు గోపాలస్వామి, లక్ష్మణ్, మల్లేశం, శోభన్, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వర్గల్(గజ్వేల్): కార్తీక దీపోత్సవంలో భాగంగా నాచగిరి ఆలయ ఆవరణలో ఆదివారం రాత్రి సూర్యాకృతిలో దీపాలు వెలిగించిన మహిళలు